

## నాటి ఖానిగి బళ్లే.. నేటి మైక్రో స్కూల్స్



ఊళ్లలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువులు చెప్పే ఉన్నత పాఠశాలల్ని 'పెద్దబడి' అని పిలుస్తారు. అక్షరాభ్యాసం నుంచి మూడు లేదా అయిదో తరగతి వరకు చదువులు చెప్పే పాఠశాలల్ని 'చిన్న బడి' అంటారు. ప్రాథమిక తరగతులు చదివే విద్యార్థులు చిన్న వయసులో ఎక్కువ దూరం ప్రయాణం చేయలేరు. కాబట్టి తక్కువ జనాభా ఉండే ఊళ్లలో చిన్నబడిని ప్రభుత్వాలు నిర్వహిస్తు న్నాయి. ఒకప్పుడు ఇలా ఊరికో చిన్న బడి ఉండేది కాదు. పెద్ద పెద్ద పట్టణాల్లోనే పాఠశాలలు ఉండేవి. బడిలేని ఊళ్లల్లో ఖానిగి బడులు ఉండేవి. ఒక పంతులు ఒక ఊరిలో పాఠశాలను ఏర్పాటు చేసుకుని వచ్చిన కొద్దిమంది పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించేవాడు. పంతులు ఒక్కడే అయినా చదువులో ఎందులోనూ తక్కువ కాదు. ప్రతి విద్యార్థికి ఇసుకలో అక్షరాలు దిద్దించడంతో మొదలుపెట్టి చదవడం, రాయడం నేర్పేవాడు. ఆ తర్వాత వ్యాకరణం, నాలుగు రకాల గణిత ప్రక్రియలు నేర్పించేవాడు. చిన్న బాల శిక్ష, పెద్దబాల శిక్షతో ఖానిగి బడిలో చదువు ముగిసేది. అలాంటి బడులన్నీ మన దగ్గర కనుమరు గైపోయాయి. ఈ ఖానిగి తరహా బడులే 'మైక్రో స్కూల్స్' పేరుతో అమెరికా విద్యా వ్యవస్థలో ఆదరణ పొందుతున్నాయి. 'మైక్రో స్కూల్'లో ఒకే తరగతి గది ఉంటుంది. అయిదారుగురు పిల్లలకు మించి ఉండరు. అనుభవపూర్వక విద్య, ఒత్తిడి లేని చదువు, ప్రతి విద్యార్థిపై ప్రత్యేకమైన శ్రద్ధ అని చెప్పుకొం టున్న ఈ మైక్రో స్కూల్స్ ఒకనాటి మన ఖానిగి బడుల్లాంటివే. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా చెప్పే చదువుల్లో మార్కులే ప్రతిభకు ప్రామాణికంగా ఉంటాయి. ఈ మైక్రో స్కూల్స్ మాత్రం జీవన నైపుణ్యాలు సాధించడమే నిజమైన చదువు అంటున్నాయి.

ఉండవు. కానీ, తరగతి గదిలోని పిల్లలందరికీ టీచర్ ఒకే పద్ధతిలో చెప్పడం వల్ల కొందరు చదువుల్లో వెనుకబడిపోతుంటారు. ఈ సమస్యకు మెగా స్కూల్ నుంచి మైక్రో స్కూల్‌కి మార్చడమే పరిష్కారంగా అమెరికాలోని విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఆ దేశంలో ప్రాథమిక స్థాయి నుంచి హయ్యర్ స్కూల్ వరకు విద్య ఉచితం. అయినా ప్రత్యేక అవసరాలు, అభ్యసన పద్ధతుల కోసం తల్లిదండ్రులు మైక్రో స్కూల్స్‌ని ఎంచుకుంటున్నారు. వీటిలో ఫీజులు అయిదు వేల డాలర్ల నుంచి పది వేల డాలర్ల మధ్య ఉంటున్నది. ఈ పాఠశాలలో చదివే పిల్లలను ఇంటి వద్ద చదువుకునే విద్యార్థులుగా ప్రభుత్వం గుర్తిస్తున్నది. వీటిలో సైన్స్, చరిత్ర, గణితంతోపాటు మత సంబంధమైన విషయాలను బోధిస్తున్నారు. అమెరికాలోని నేషనల్ మైక్రో స్కూలింగ్ సెంటర్ లెక్కల ప్రకారం ఆ దేశంలో 95,000 వరకూ మైక్రో స్కూల్స్ ఉన్నాయి. ఈ పాఠశాలల్లో పది లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. మైక్రో స్కూల్స్‌లో చదివే పది లక్షల మంది విద్యార్థుల్లో 40 శాతం మంది పబ్లిక్ స్కూల్స్ నుంచి వచ్చినవాళ్లు ఉండటం విశేషం. మిగతా విద్యార్థులు ఇళ్లలోనే విద్యాభ్యాసం మొదలుపెట్టిన వాళ్లు. ఈ పాఠశాలలకూ ప్రభుత్వాలు గుర్తింపునిచ్చాయి. అరిజోనా, వెస్ట్ వర్జీనియా, జార్జియా రాష్ట్రాల్లో మైక్రో స్కూల్స్‌కి రోజురోజుకీ ఆదరణ పెరుగుతున్నది.

గత ఏప్రిల్‌లో హోమ్ స్కూలింగ్ విద్యా విధానానికి అనుకూలంగా జార్జియా ప్రభుత్వం కొన్ని చట్టాలు రూపొందించింది. 'తక్కువ మంది విద్యార్థులు ఉండే పాఠశాలల్లో సౌకర్యాలు ఉండవేమో?' అన్న సందేహం లేదు. ప్రాథమిక విద్యాభ్యాసానికి కావాల్సిన బోధనోపకరణాలు, మౌలిక వసతులకు ఇక్కడ లోటు ఉండదు. మైక్రో స్కూల్స్‌కి సంపన్నులు, కంపెనీల నుంచి విరాళాల రూపంలో ఆర్థిక వనరులు సమకూరుతున్నాయి. గత విద్యా సంవత్సరంలో ఈ విరాళాలు 18 శాతం పెరిగాయి. అమెరికాలో సంపన్నులైన జెఫ్ యాస్, కొచ్ ఫ్యామిలీ వంటి దాతలు కూడా ఈ మైక్రో స్కూల్స్‌కి నిధులు సమకూరుస్తున్నారు.



ఏడుగురు విద్యార్థుల పాఠశాల కింగ్‌డమ్ సీడ్ క్రిస్టియన్ అకాడమీలో ఆడుతూ పాడుతూ చదువుకుంటున్న నతానియేల్

### ఆసరా బళ్లు

వైకల్యం ఉన్న పిల్లలు, ఆటిజం బాధితులు మైక్రో స్కూల్స్‌లో చేరేందుకు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. మైక్రో స్కూల్స్ రోజుకు నాలుగు గంటల చొప్పున వారంలో అయిదు రోజులు పనిచేస్తాయి. విద్యార్థుల అభ్యసన సామర్థ్యానికి తగిన పాఠ్యాంశాలనే ఇక్కడ బోధిస్తారు. ప్రామాణిక పరీక్షలను కూడా నిర్వహిస్తారు. పెద్ద పాఠశాలల కంటే మైక్రో స్కూల్స్‌లోనే తమకోసం తగిన ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయని ఆ విద్యార్థులు సంతృప్తి చెందుతున్నారు.

### భవిష్యత్ బడిబాట

మైక్రో స్కూలింగ్ విధానం మన దేశంలోకీ ప్రవేశించింది. ముంబయిలో ప్రియాంక రాయ్ 'కోమిని' మైక్రో స్కూల్‌ని స్థాపించింది. కర్ణాటకలో అజిల్ పాఠశాల విద్యార్థుల పాఠ్యాంశాన్ని బట్టి ప్రదేశాన్ని ఎంచుకుని పాఠాలు బోధించే ప్రయత్నం చేస్తున్నది. హైదరాబాద్‌లో డ్రీమ్‌టైమ్ లెర్నింగ్ హబ్ మైక్రో స్కూల్ రెండు నుంచి 16 ఏండ్ల లోపు పిల్లలకు చదువు చెబుతున్నది. ఇవన్నీ తాతల కాలం నాటి ఖానిగి బడి లాంటివే. కనుమరుగైపోయిన బళ్లు మళ్లీ పేరు మార్చుతో, కాలానికి తగ్గ హంగులతో కొత్తగా వస్తున్నాయ్! ■

ఓ ఇంటి ఆరుబయట విద్యార్థులకు సైన్స్ పాఠాలు బోధిస్తున్న కింగ్‌డమ్ స్కూల్ ఉపాధ్యాయులు

